క్లుప్తంగా

అన్నమయ్య వర్ధంతి ఉత్సవాలు



అన్నమయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాభారతి ప్రతినిధులు

కడప రూరల్ : కడప మున్సిపల్ హైస్కూల్ వద్ద పాత విగ్రహాన్ని పునః ప్రతిష్ట చేయాలని అన్నమయ్య కళాభారతి, అన్నమాచార్య విగ్రహ పరిరక్షణ సమితి కార్యదర్శి గాజులపల్లె సుబ్బరాయుడు కోరారు. అన్నమయ్య వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం తమ కార్యాలయంలో అన్నమయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అబ్బిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1983లో అప్పటి ముఖ్యమంత్రి అంజయ్య చేతుల మీదుగా అన్నమయ్య విగ్రహాన్ని ఆవిష్కరించడం జరిగిందన్నారు. నగర అభివృద్ధిలో భాగంగా అన్నమయ్య విగ్రహాన్ని తొలగించి పెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య భక్తులు, అభిమానులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు మనోజ్‌కుమార్

కడప ఎడ్యుకేషన్ : పింఛనుదారుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి శనివారం ప్రారంభించారు. కడప పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో వారు మాట్లాడుతూ మానవ శరీరంలోని అన్ని అవయవాలలో కళ్లు చాలా ముఖ్యమైనవని, ప్రతి ఒక్కరూ అప్పుడప్పుడూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం కంటి వైద్యులు డాక్టర్ మనోజ్‌కుమార్ పలువురికీ వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పింఛనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి, కోశాధికారి నగేష్, ఉపాధ్యక్షుడు శంకరయ్య, అమర్‌నాథ్‌రెడ్డి, వెంకటేస్, శ్రావణి, నిఖిత పాల్గొన్నారు.

పదవీ కాంక్షతోనే షర్మిల ఆరోపణలు

- వైఎస్ఆర్, వివేకా ఆత్మలు ఘోషిస్తున్నాయి
- ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మెన్ పులి సునీల్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పులి సునీల్, నిత్యానందరెడ్డి

కడప కార్పొరేషన్ : పదవీ కాంక్షతోనే పీసీసీ అధ్యక్షురాలు షర్మిల లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మెన్ పులి సునీల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి విమర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏపీని ఉద్ధరించడానికి వచ్చినట్లు షర్మిల చేస్తున్న విమర్శలు చూస్తే జాలిపడాలో, బాధపడాలో అర్థం కావడం లేదన్నారు. తెలంగాణలో ప్రజలు ఆమెను ఆదరించి అభిమానిస్తే ఎన్నికల్లో పోటీ చేయకుండా అస్త్ర సన్యాసం చేసి పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారన్నారు. తెలంగాణ బిడ్డనని చెప్పుకున్న ఆమె.. వైఎస్సార్ కుటుంబాన్ని రోడ్డున పడేసిన కాంగ్రెస్ పార్టీలో చేరి విమర్శలు చేస్తోందన్నారు. రాష్ట్రాన్ని విడదీసిన కాంగ్రెస్ పార్టీ.. ప్రత్యేక హోదా అంశాన్ని చట్టంలో ఎందుకు పొందుపరచలేదని ప్రశ్నించారు. పదవీ కాంక్షతో చంద్రబాబు అందించిన స్క్రిప్టు ప్రకారం ఆరోపణలు చేయడం దారుణమన్నారు. పదవీ కాంక్షతో వైఎస్ వివేకా ఎలా కాంగ్రెస్‌లో కొనసాగారో, అదే విధంగా షర్మిల, సునీత వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నిందితులుగా ఉన్న వారిని హంతకులని మాట్లాడటం అత్యంత అన్యాయమన్నారు. వివేకానందరెడ్డిపై అంత ప్రేమ ఉంటే నాలుగేళ్లుగా షర్మిల ఏం చేస్తున్నారని, ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఇపుడు సునీతతో కలిసి ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్.అవినాష్‌రెడ్డి పేరు ఉచ్చరించే అర్హత కూడా వారికి లేదన్నారు. వైఎస్ వివేకా చుట్టూ ఉన్నవారే ఆయన్ను చంపారని, ఆ హత్యను వైఎస్.అవినాష్‌రెడ్డికి అంటగట్టడం అత్యంత దారుణమన్నారు. వైఎస్సార్ బిడ్డనని చెప్పుకొంటూ ఆయన పరువు తీసేలా వ్యవహరించడం పద్ధతి కాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో రహీమ్, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ మాసం ధానధర్మాలకు ప్రతీక



నిరుపేదలకు రంపాజ్ తోఫాను అందజేస్తున్న లయన్ పటాన్ ఖాదర్‌భాష

కడప ఎడ్యుకేషన్: రంజాన్ మాసం ధానధర్మాలకు ప్రతీక అని, పేదవాళ్ల ఆకలిని తీర్చడమే ఈ మాసం ముఖ్య ఉద్దేశ్యమని జెకె జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పటాన్ ఖాదర్‌భాష అన్నారు. కడప రవీంద్రనగర్‌లోని మదరసాలో ముస్లిం మైనార్టీ నాయకులు హమీద్ అండ్ సన్స్, గఫార్‌బాష ఆధ్వర్యంలో శనివారం 300 మందికి నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఖాదర్‌భాష మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఎన్ని ధాన ధర్మాలు చేస్తే అంత పుణ్యఫలం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కేకేఆర్ తారిక్ అలీ, సామాజిక కార్యకర్త జాబీర్ అలీ, ఖాజా హుస్సేన్, కడప నగర ముస్లిం మైనార్టీ నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

నిరుపేదలకు సరకుల పంపిణీ

కడప ఎడ్యుకేషన్ : షబ్ ఎ ఖదర్ పండగను పురస్కరించుకుని కడప నగరం ట్రంక్ రోడ్డులోని మౌలానా సొసైటీ కార్యాలయంలో పేదలకు గురువారం 20 రకాల నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ షబ్బీర్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో నిరుపేదలకు సరకులు దానం చేయడం పుణ్యకార్యమని, తన కుమారులతో కలిసి ఇలా చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ షౌకత్ అలీ, మహమ్మద్ సర్ఫరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మాచరణతోనే మనిషికి పరిపూర్ణత



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విద్యా వాసుదేవతీర్థ స్వామి, ఇతర అతిథులు

కడప కల్చరల్ : ధర్మాచరణ చేసినపుడే మనిషికి పరిపూర్ణత లభిస్తుందని, అలాంటి వారికే సమాజంలో విలువ ఉంటుందని మహారాష్ట్రకు చెందిన ఆధ్యాత్మిక ఆశ్రమ అధిపతి విద్యా వాసుదేవతీర్థ స్వామి పేర్కొన్నారు. కడప మున్సిపల్ మైదానంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో విశ్రాంత అధ్యాపకులు ఉప్పరపు సూర్యనారాయణ రచించిన కర్మబంధం–తెగని సంబంధం పుస్తకాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కర్మ సిద్ధాంతం గురించి వాసుదేవతీర్థ స్వామి వివరించారు. రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ పుస్తకంలోని ధార్మిక మర్మాలను గురించి వివరించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి భక్తి మార్గంలో పయనించే వారికి ఈ పుస్తకం ఉపయోగపడగలదని అభిప్రాయపడ్డారు. సభాధ్యక్షులు డాక్టర్ గోపినాథ్ జీవన ప్రవంతిలో ఆధ్యాత్మిక ప్రయాణం గురించి వివరించారు. స్థానిక మృత్యుంజయేశ్వర సర్వ మంగళాదేవి పీఠం అధ్యక్షులు జి.రామకృష్ణ పుస్తకాన్ని సమీక్షిస్తూ ఈ పుస్తకం ఆత్మజ్ఞానాన్ని ప్రబోధిస్తున్నదని తెలిపారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, ప్రసాద్, విజయ్‌కుమార్, రామచంద్రయ్యలు మాట్లాడారు. నిర్వాహకులు అతిథులందరినీ ఘనంగా సత్కరించారు.

అవకాశాలను అందిపుచ్చుకొనేలా బోధన

ప్రిన్సిపల్ డా.జి.రవీంద్రనాథ్

వైవీయూ : పోటీ ప్రపంచంలో సరికొత్త అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులకు బోధన కొనసాగాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డా.జి.రవీంద్రనాథ్ సూచించారు. కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో కడప, అన్నమయ్య, నంద్యాల జిల్లాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో సమర్థంగా వినియోగించడం ద్వారా బోధన ఫలవంతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్లుగా తెలుగు శాఖ విభాగాధిపతి డాక్టర్ సుందరేశ్వరరావు, సబ్జెక్టు నిపుణులు ఐ.నాగేశ్వరరెడ్డి, కె.గురప్ప, జి.చెంచుబాబు, సాంకేతిక సహాయకులుగా సారథి, మంజుల, విశ్వనాథ్ నాయక్ వ్యవహరించారు.



శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులు

కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య నగర కార్యదర్శి కె.శివశంకర్ డిమాండ్ చేశారు. కడప నగరంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన ఏఐఎస్ఎఫ్ నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ విద్యార్థులకు మే 30 వరకు సెలవులు ప్రకటించారన్నారు. అయితే నగరంలోని నారాయణ, శ్రీ చైతన్య లాంటి కార్పొరేట్ విద్యా సంస్థలు నీట్, ఎంసెట్ షార్ట్ టర్మ్ పేరుతో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. మండే ఎండల్లో విద్యార్థులను మానసికంగా, శారీరకంగానూ ఇబ్బంది పెడుతూ వారి ప్రాణాలతో చెలగాటలాడుతున్నారని తెలిపారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కళాశాల ఎదుట ధర్నా చేపట్టినప్పటికీ ఆర్ఐఓ స్పందించకుండా కాలేజీ యాజమాన్యంతో కుమ్మక్కై చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కె.శివశంకర్, బి.అరుణ్, అభిరా నందన్, చంద్ర, తేజ, మల్లికార్జున, శివ, లోకాభిరాం, అశోక్, రాజేష్, చైతన్, భాను, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులతో పనులు చేయించడం నేరం

జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్



వైవీ స్ట్రీట్‌లోని దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్, అధికారులు

కడప అర్బన్ : షాపింగ్ మాల్స్, దుకాణాలలో చిన్న పిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ హెచ్చరించారు. కడప వైవీ స్ట్రీట్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'బంధిత కార్మికుల రక్షణ మరియు పునరావాసం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. లేబర్ డిపార్ట్‌మెంట్, పోలీసు అధికారులతో కలిసి రెస్క్యూ చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ వయసు ధృవీకరణ పత్రాలు తీసుకుని షాపులలో పనిచేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.హరిబాబు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.శాంత, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎం.పాల్ జాన్సన్, జి.శ్రీనివాసరెడ్డి, కె. మునుస్వామి, దిశ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ నిర్మలాదేవి, షాపు యజమానులు పాల్గొన్నారు.

ప్రజలను రెచ్చగొట్టే పోస్టులు వద్దు

కడప టూటౌన్ సీఐ గడ్డం ఇబ్రహీం



మాట్లాడుతున్న కడప టూటౌన్ సీఐ గడ్డం ఇబ్రహీం

కడప అర్బన్ : ప్రజలను రెచ్చగొట్టేలా సోషియల్ మీడియాలో పోస్టులు పెడితే కఠినచర్యలు తీసుకుంటామని కడప టూటౌన్ సీఐ గడ్డం ఇబ్రహీం అన్నారు. విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ అల్మాస్‌పేటలోని తాలీమ్ మసీదు వద్ద మూడు రోజుల క్రితం జరిగిన ఘర్షణ నేపథ్యంలో కొంతమంది వ్యక్తులు అదే పనిగా ఫేస్‌బుక్, వాట్సాప్‌గ్రూప్, ఇన్‌స్టాగామ్ వేదికలపై రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టడం తగదన్నారు. రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టినా, గొడవలు సృష్టించాలనీ చూసినా ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని వాట్సాప్ గ్రూపులు సోషియల్ మీడియాపై నిఘా వుంచామన్నారు.



మంచి జీవనశైలితోనే మెరుగైన ఆరోగ్యం

నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



కడప రూరల్ : కాలుష్యం, కల్తీ వస్తువులతో వాతావరణంలో మార్పులు సంభవించాయి. మారిన జీవనశైలి, ఇతర కారణాలతో ఆ ప్రభావం ఆరోగ్యంపై పడింది.ఆహారంలో మార్పు సంభవించడంతో బీపీ, షుగర్ ఇతర దీర్ఘకాలిక వ్యాధులు మనిషి ఆరోగ్యంపై దాడులు చేస్తున్నాయి. ఆరోగ్యంగా ఉండాలంటే.. మద్యం, ధూమపానానికి దూరంగా ఉండాలని, ఆహారం, త్రాగు నీరు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తగు మోతాదులో మాంసకృతులు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. వ్యాయామం చేసి, వైద్యుల సూచనలు పాటిస్తే అవయవాలు బాగుండి.. మెరుగైన ఆరోగ్యం సమకూరుతుందని వైద్యులు సూచిస్తున్నారు.

చిన్నారులకు ద్రవ పదార్థాలు శ్రేయస్కరం



అలాగే వివిధ రకాలైన జబ్బులకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. వేసవి కాలంలో చిన్న పిల్లలకు ఎక్కువగా ద్రవ పదార్థాలు ఇవ్వాలి. బయట దొరికే కూల్ డ్రింక్స్, ఐస్ క్రీం, పండ్ల రసాలు మంచిది కాదు. వడదెబ్బ కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ సీ ఓబుల్‌రెడ్డి, పురిటి పిల్లలు, చిన్న పిల్లల వైద్యులు

రొబొటిక్ టెక్నాలజీతో మోకాలి మార్పిడి



మోకాలి మార్పిడి సర్జరీలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. రొటిక్ టెక్నాలజీ ద్వారా పేషెంట్ మోకాలు ఎముకల త్రీడీ ఇమేజెస్‌ను శస్త్ర చికిత్సలో భాగంగా తీసుకోవడం ద్వారా అరిగిన శాతం గుర్తించవచ్చు. గడచిన 15 ఏళ్లలో 6 వేల సర్జరీలు నిర్వహించాం.

– డాక్టర్ సీ విద్యాసాగర్‌రెడ్డి, కీళ్ల మార్పిడి వైద్యులు

గర్భిణులకు పౌష్టికాహారం



ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న వైద్య సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత తెలిపారు. రాజీవ్ గాంధీనగర్ అంగన్వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. చిన్నారులకు ఏ వ్యాక్సిన్లు వేస్తున్నారు? ఎందుకు వేస్తున్నారో తల్లులకు వివరించారు. వ్యాధి నిరోధక టీకాలు తప్పని సరిగా వేయించుకోవాలని సూచించారు. పోషక విలువలు కలిగిన ఆహారం, తీసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డలకు రక్తహీనత లేకుండా చూస్తామన్నారు. వార్డు హెల్త్ సెక్రటరీల వద్ద లభించే ఐరన్ పోలిక్ యాసిడ్ ట్యాబెట్లను తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఎండ తీవ్రత అధికంగా ఉందని, ఉదయం 9 గంటల్లోగా, సాయంత్రం 5 గంటల తర్వాత బయటికి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ వైద్యులు నవీద్, ప్రశాంత్, సౌమ్య, సుకన్య, లలిత, ఆరోగ్య కార్యకర్తలు సరోజమ్మ, నాగమణి, అంగన్వాడీ వర్కర్లు చంద్రకళ, నాగవేణి, తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వరుడికి తైలాభిషేకం

భక్తిశ్రద్ధలతో శని ప్రదోష పూజ



స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు, విశేష అలంకారంలో శనీశ్వరస్వామి

కడప కల్చరల్ : శని త్రయోదశి స్థానిక రామకృష్ణనగర్‌లోని శనీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు సామూహికంగా తైలాభిషేకం నిర్వహించారు. అర్చకులు తమ గోత్ర నామాలతో శనీశ్వరునికి పూజలు చేసి పలు రకాల పుష్పాలతో అలంకరించారు. నల్లని వస్త్రాలు సమర్పించి నువ్వులతో అర్చించి నివేదన, కర్పూర హారతి, తదితర పూజలు చేశారు. పలువురు భక్తులు ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించారు. నవగ్రహాలకు ప్రదక్షిణలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గడ్డిబజారులో

కడప నగరం గడ్డిబజారులోని సోమసుందరేశ్వరస్వామి ఆలయంలో శనివారం శని ప్రదోష పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చక బృందం స్వామికి ప్రత్యేకంగా తైలాభిషేకం, నందీశ్వరుడికి పంచామృతాభిషేకం నిర్వహించారు.